

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఇష్టమున్న రంగాల్లో పిల్లలను ప్రోత్సహించాలి

● ఎంపీ ఈటల రాజేందర్

అమీర్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచుల మేరకు ప్రోత్సహిస్తే వారు ఏ రంగాల్లోనైనా రాణిస్తారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అమీర్‌పేటలోని సెస్ ఆడిటోరియంలో విజయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులకు అవార్డులను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు తమ జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో ప్రయత్నిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. పిల్లల్లో రోజురోజుకు సృజనాత్మకత పెరుగుతోందని.. దాన్ని వెలికితీసి దేశానికి ఆణిముత్యాల్లాంటి నిష్ణాతుల్ని అందించాలని అకాడమీ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి. జేఎన్టీయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి'

పంజాగుట్ట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ ఆర్.అశోక్ డిమాండ్ చేశారు. ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు సోమవారం యూసఫ్‌గూడ బస్తీ లేబర్ అడ్డా నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సందర్భంగా అంబేడ్కర్‌ను అవమానించడం దేశద్రోహం కిందికి వస్తుందని, అమిత్ షాపై కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు టి.సాయి శేషగిరిరావు, జె.స్వామి, పార్టీ నాయకులు దండు సత్యనారాయణ, వై.యాదగిరి, బి.లక్ష్మణ్, రఘు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 86, శాలివాహన నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సవేరా ఫంక్షన్ హాల్, లోటస్ పాండ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రేమ్ నగర్, శంకర్‌లాల్ నగర్, మెజెస్టిక్ మాన్షన్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు బేగంపేట నాలా, వరుణ్ టవర్స్ శ్రీముఖి ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

లూథరన్ చర్చిపై తప్పుడు ప్రచారం సరికాదు

● చర్చి ప్రతినిధులు

ఖైరతాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా కొన్ని టీవీ చానెళ్లు (ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కాదు), యూట్యూబ్ చానెళ్లు క్రైస్తవుల మనోభావాలు దెబ్బతినేలా తప్పుడు ప్రచారం చేశాయని లూథరన్ చర్చి పాస్టర్, క్రైస్తవ మత పెద్దలు మండిపడ్డారు. సోమవారం లక్డీకాపూల్‌లోని లూథరన్ చర్చిలో పాస్టర్ డాక్టర్ జీవన్‌కుమార్, మతపెద్దలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు సంవత్సరాల క్రితం చర్చిలో ఇద్దరు పాస్టర్‌ల మధ్య జరిగిన గొడవను ఈ సంవత్సరం క్రిస్మస్ రోజు జరిగినట్టుగా సోషల్ మీడియాతో పాటు కొన్ని టీవీ ఛానెళ్లు చూపించి క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీశాయన్నారు. గతంలో ఇద్దరి మధ్య జరిగిన వ్యక్తిగత గొడవలను క్రిస్మస్ కానుకల పంపిణీలో విషయంలో జరిగినట్లు చూపించారని మండిపడ్డారు. ఛానెళ్లవారు తమ తప్పులను సవరించుకోవాలని, లేని పక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చర్చి ప్రతినిధులు అంగెల వెరోనిక, మెంటాయ్ సునీల్, జ్ఞాన ప్రకాష్‌రావు, మణికుమార్, శ్యాం సుందర్, భూపతి పాల్గొన్నారు.



సుధీర్‌చంద్ర మృతిపై సంతాపం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

అసిస్టెంట్ కమిషనర్ సుధీర్‌చంద్రకు ఉద్యోగుల నివాళి

ఖైరతాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ సర్కిల్ 17 (ఖైరతాబాద్) అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నాగబండ్ల సుధీర్‌చంద్ర మృతిపై ఖైరతాబాద్ జోన్ అధికారులు, సిబ్బంది సంతాపం తెలియజేశారు. సోమవారం ఉదయం కార్యాలయంలో జరిగిన సంతాప కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్కిల్ 18 ఉప కమిషనర్ ప్రశాంతి, అధికారులు మాట్లాడుతూ.. కష్టపడి పని చేస్తూ కిందిస్థాయి నుంచి ఏఎంసీ స్థాయికి చేరారన్నారు. సుధీర్‌చంద్ర మంచితనంతో అందరినీ ఆకట్టుకున్నాడని, పనిలో శ్రద్ధ, నేర్పరితనం కనబర్చేవాడని కొనియాడారు.

డ్యూటీకి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



సుధాకర్ (ఫైల్)

బోరబండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర ధర్మాబాద్‌కు చెందిన సుధాకర్ (45) రాజీవ్‌నగర్‌లో ఉంటున్న సోదరి వద్ద ఉంటూ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. నవంబర్ 21న డ్యూటీకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో అతడి అన్న శ్రీనివాస్ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

యూరప్‌లో ఉద్యోగం పేరుతో మోసం.. కేసు నమోదు

బంజారాహిల్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యూరప్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బు తీసుకున్న భార్యాభర్తలపై కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 5లో నివసించే సిబ్రప్రసాద్ రాయదుర్గంలోని అంతేరా హోటల్ స్టోర్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. కొద్ది కాలం క్రితం మిత్రుడు రాజేశ్వర రావు ద్వారా గడ్డం రమేష్, ఉమారాణి పరిచయమయ్యారు. రమేష్ విదేశాల్లో నుంచి వచ్చి నగరంలోని గాజులరామారంలో ఉంటున్నాడు. తనకు యూరప్‌లో చాలామంది వ్యాపారవేత్తలతో పరిచయాలు ఉన్నాయని చెప్పడంతో ప్రసాద్ తనను యూరప్ పంపించాలని కోరాడు. దీంతో రమేష్‌కు పలు దఫాలుగా సుమారు నాలుగు లక్షల రూపాయలు ఇచ్చాడు. అయితే రోజులు గడుస్తున్నా తనను విదేశాలకు పంపించలేదు. డబ్బు తిరిగి ఇచ్చేయాలని కోరినా స్పందించకపోవడంతో ఇంటికి వెళ్లి నిలదీయగా రూ.1.30 లక్షలు ఇచ్చారు. మిగతా రూ.2.70 లక్షలు ఇవ్వకపోవడంతో బాధితుడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు కిక్కిచ్చేలా..

● నూతన సంవత్సర వేడుకలకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో భారీ ఏర్పాట్లు
● ప్రత్యేక ఆఫర్‌లు ప్రకటిస్తున్న నిర్వాహకులు
● పార్టీలపై పోలీసుల ప్రత్యేక నిఘా



బంజారాహిల్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరమంతా దృష్టిసారించే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతంలో నూతన ఏడాదికి ఘన స్వాగతం పలికేందుకు కుర్రకారు సిద్ధమవుతోంది. పబ్‌లు, క్లబ్‌లు, హోటళ్లు, రిసార్ట్‌లలో సంబురాలను నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసి కుర్రకారుకు కిక్కిచ్చేలా నిర్వాహకులు ప్లాన్ చేస్తున్నారు.

హోరెత్తించనున్న డీజే సౌండ్స్..

ఈసారి వేడుకల్లో డీజేల హోరు కనిపించనుంది. వివిధ ప్రాంతాల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం డీజే నిర్వాహకులు వస్తున్నారు. తాజ్ గ్రూప్ హోటల్స్, రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్స్‌లో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జూబ్లీహిల్స్‌లోని 32 పబ్‌లు, జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో బెంగళూరు, కోల్‌కత్తా నుంచి డీజేలనురప్పిస్తున్నారు. ఈ రోజు రాత్రి 9 గంటల నుంచే వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. కొవ్వొత్తుల వెలుగుల్లో డిన్నర్‌తో పాటు లేజర్ షోలు నయాసాల్ వేడుకల్లో కనువిందు చేయనున్నాయి. జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్ నిర్వాహకులు ఆస్ట్రేలియా నుంచి ప్రత్యేకంగా డీజేలను తీసుకొస్తున్నారు. మరోపబ్ నిర్వాహకులు బాలీవుడ్ గాయకులతో లైవ్ కాన్‌క్లేవ్ నిర్వహిస్తున్నారు.

ఈవెంట్ నిర్వాహకులదే బాధ్యత..

నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. పార్టీకి వచ్చే వారికి ఏం జరిగినా పూర్తి బాధ్యత ఈవెంట్ నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. నయాసాల్ వేడుకల్లో డ్రగ్స్ దందా జోరందుకుంటుందన్న సమాచారం నేపథ్యంలో పబ్‌లు, హుక్కా సెంటర్‌లు, రెస్టారెంట్‌లపై ప్రత్యేక నిఘా పెట్టారు. పబ్, ఈవెంట్ మేనేజర్‌లకు నోటీసులిచ్చారు. మత్తు పదార్థాలను సరఫరా చేసినా, ఎవరితోనైనా అమ్మించినా వదిలేది లేదని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ప్రతి ఏటా మద్యం మత్తులో యువత రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా హిల్స్ ప్రాంతంలో ప్రమాదాలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా డ్రంక్ అండ్ డ్రైవ్‌ను అధికంగా చేపట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల వేగాన్ని నిరోధించేందుకు బారికేడ్లు, వేగ నిరోధకాలు పెడుతున్నారు.

మత్తులో అల్లరి చేస్తే జైలుకే..

ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి పోలీసులకు చిక్కితే జైలుకు వెళ్లాల్సిందే. రోడ్డు మీద మద్యం తాగినా, మత్తులో గొడవ చేసినా పెట్టీ కేసులు నమోదు చేసి నేరుగా కోర్టుకు పంపిస్తారు. న్యాయమూర్తి ఇలాంటి వారికి రెండు నుంచి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. రాత్రి తాగి రోడ్ల మీదకు వస్తే సహించేది లేదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అంతే కాకుండా పబ్‌లు, బార్‌ల నిర్వాహకులకు పోలీసులు ప్రత్యేక మార్గదర్శకాలు చేశారు. పార్టీల పేరుతో రాత్రంతా తెరిచి ఉంచితే ఊరుకునేది లేదని.. గొడవలు జరగకుండా అదనపు భద్రత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఎంజాయ్ చేయండి.. మేమే తీసుకెళ్తాం..

నయాసాల్ వేడుకల్లో మందు లేకపోతే మజా ఉండదనేది చాలామంది అభిప్రాయం. అయితే తాగుదామంటే డ్రంకెన్‌డ్రైవ్‌లో దొరికిపోతామనే భయం యువతలో ఉంది. అలాంటి వారికోసం కొన్ని పబ్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వాహకులు బంపర్ ఆఫర్‌ను ప్రకటించాయి. పార్టీలో ఎంజాయ్ చేసి మస్తుగా తాగిన తరువాత జాగ్రత్తగా ఇంటివద్ద దింపడం తాము చూసుకుంటామని చెబుతున్నారు. పార్టీ అయిపోయిన వెంటనే షేరింగ్ ప్రకారం క్యాబ్‌లలో జాగ్రత్తగా ఇంటికి పంపించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఈవెంట్ నిర్వాహకులు క్యాబ్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ప్రయాణం ఖర్చుతో కలిపి టికెట్లను అమ్ముతున్నారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని నిర్వాహకులు అంటున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

● బోరబండ సీఐ వీరశేఖర్



హాస్టళ్ల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాటాడుతున్న ఏసీపీ వెంకటరమణ

బోరబండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను నిర్ధేశిత సమయంలోపే ముగించాలని, యువత మద్యం తాగి రహదారులపై తిరుగుతూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని బోరబండ పోలీస్ స్టేషన్ సీఐ వీరశేఖర్ పేర్కొన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకల్లో గత సంవత్సరం అనుభవాల దృష్ట్యా ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధిక శబ్ధంతో కూడిన డీజేలు నిషేధమని, బాణసంచాలకు అనుమతులు లేవన్నారు. 31న రాత్రి 12గంటల తరువాత రహదారులపై ఎలాంటి వేడుకలు నిర్వహించకూడదని, కేక్ కటింగ్‌లలో అశ్లీల నృత్యాలు, మైనర్‌లు మద్యం తాగడం వంటివి జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు.

ఉమెన్స్ హాస్టళ్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

అమీర్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 31 రాత్రి ఏలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉమెన్స్ హాస్టళ్ల నిర్వాహకులు పోలీసుల నిబంధనలను తప్పకుండా పాటించాలని ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ సూచించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో లేడిస్ హాస్టళ్ల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్ల ముందు సీసీ కెమెరాల ఏర్పాటు, లైటింగ్, సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని, అనుమానిత వ్యక్తుల కదిలికలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు మెయింటైన్ రిజిస్ట ఉంచాలన్నారు. అర్ధరాత్రి యువకులు తాగివచ్చి గొడవకు దిగితే వెంటనే పోలీసులకు లేదా 100కు సమాచారం ఇవ్వాలన్నారు. నిబంధనలు పాటించని హాస్టళ్ల నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్‌ఐలు శ్రావణ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో దివ్యాంగుల శాఖ కమిషనర్ శైలజ, శ్రీనివాస్, రాపోలు భాస్కర్ తదితరులు

చదువు అందరి జీవితాల్లో వెలుగులు నింపుతుంది

● దివ్యాంగుల శాఖ కమిషనర్ శైలజ

బేగంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చదువు అందరి జీవితాల్లో వెలుగులు నింపుతుందని, ప్రతి ఒక్కరూ చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని దివ్యాంగుల శాఖ కమిషనర్ శైలజ అన్నారు. సోమవారం దివ్యాంగుల నెట్ వర్క్ (ఎన్‌పీడీఓ) ఆధ్వర్యంలో వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు సైగల భాష- ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం బేగంపేటలోని హరిత ప్లాజా హోటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి దివ్యాంగుల శాఖ కమిషనర్ శైలజ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బధిరులని ఎవరూ బాధపడవద్దని, అవకాశాలను సద్వినియోగం చేసుకుని మంచి స్థితికి చేరుకోవాలని సూచించారు. ఇందుకు అవసరమైన వసతులను స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయభాస్కర్, బాలకృష్ణారెడ్డి, ఎన్‌పీడీఓ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో జవాబుదారీతనం ఉండాలి

● రాచకొండ సీపీ సుధీర్‌బాబు
● ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు బాడీవోర్న్ కెమెరాలు అందజేత



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధి నిర్వహణలో పారదర్శకంగా, జవాబుదారీతనంగా వ్యవహరించాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు ట్రాఫిక్ సిబ్బందిని ఆదేశించారు. డ్యూటీలో ఉన్నప్పుడు ప్రజలతో వారు ప్రవర్తించే విధానం గౌరవప్రదంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా వారు మాట్లాడే ప్రతి విషయం రికార్డు అయ్యే విధంగా సిబ్బందికి బాడీవోర్న్ కెమెరాలను అందజేశారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో జరిగిన ట్రాఫిక్ మీటింగ్‌లో ట్రాఫిక్ అధికారులకు కెమెరాలు అందజేశారు. ప్రస్తుతం 50 కెమెరాలు అందజేసిన సీపీ.. ట్రాఫిక్ విధులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సిబ్బంది యూనిఫామ్‌కు అమర్చే కెమెరాల వల్ల జవాబుదారీతనం, పారదర్శకతతో పాటు మాట్లాడే ప్రతి విషయం రికార్డు అవుతుందన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినా, పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించినా ఆధారాలతో సహ రికార్డు చేస్తుందన్నారు. అంతేకాకుండా ఎవరైనా అధికారులు ప్రజలతో దురుసుగా ప్రవర్తించినా, ఎన్‌ఫోర్స్‌మెంట్ చేస్తున్న క్రమంలో ఏదైనా ఇబ్బందులు పెట్టినా, అధికారులు అక్రమాలకు పాల్పడినా వెంటనే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, ఎస్‌వోటీ డీసీపీలు మురళీధర్, రమణారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలను ప్రజలు వినియోగించుకోవాలి

● డిప్యూటీ తహసీల్దార్ మాధవి

అమీర్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని అమీర్‌పేట మండల డిప్యూటీ తహసీల్దార్ మాధవి సూచించారు. సోమవారం దళిత సంఘం అధ్యక్షులు గొలుసుల సత్యనారాయణ ఆధ్వర్యంలో పౌర హక్కులపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టళ్లలో చేరాలనుకునే విద్యార్థులు, ఉన్నత విద్యను అభ్యసించి విదేశాలకు వెళ్లాలనుకునే వారు, వంచనకు గురైన బాలికలు పౌర హక్కులను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరెడ్డి, పుష్పలత, ఎస్ఎస్ రావు, డివిజన్ అధ్యక్షులు కటకం భాస్కర్, గుడిగె శ్రీనివాస్ యాదవ్, బుద్ధనగర్ అధ్యక్షులు బాజీబాబా తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ మాధవి

అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పించిన కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అజ్మీర్ దర్గా ఉర్సు సందర్భంగా ఏటా సమర్పించే 'చాదర్'ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్పించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మత పెద్దలకు బీఆర్ఎస్ పార్టీ, తమ కుటుంబం తరఫున కేటీఆర్ చాదర్‌ను సమర్పించారు.

టేబుల్ టెన్నిస్ విజేత మైరా



పోటీల్లో ప్రత్యర్థితో తలపడుతున్న మైరా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ పోటీల్లో మైరా జైన్ విజేతగా నిలిచింది. సోమవారం ఖైరతాబాద్‌లో ముగిసిన ఈ పోటీల్లో బాలికల అండర్-11 విభాగం ఫైనల్లో మైరా 3-2తో అపర్ణపై నెగ్గి విజేతగా నిలిచింది. బాలుర అండర్-11 విభాగంలో హనీష్ 3-0తో శ్రీనాథ్‌పై గెలిచి టైటిల్ దక్కించుకున్నాడు.

చెస్ టోర్నమెంట్‌లో సత్తా చాటిన ఎమ్మెల్యే సబితారెడ్డి మనవడు



ట్రోఫీతో పట్లోళ్ల ఇంద్రారెడ్డి

బంజారాహిల్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి మనవడు, పట్లోళ్ల కార్తీక్ రెడ్డి కుమారుడు ఇంద్రారెడ్డి ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో అండర్-11 బాలుర విభాగంలో ఛాంపియన్‌గా నిలిచాడు. జూబ్లీహిల్స్‌లోని ఓ చెస్ అకాడమీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను అకాడమీ సీఈఓ సందీప్ నాయుడు వెల్లడించారు. కాన్పూర్‌లో గతవారం ఐదు రోజుల పాటు నిర్వహించిన క్రిష్ణగోపాల్ కపూర్ మెమోరియల్ ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ఇంద్రారెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారని.. అండర్-11 బాలుర విభాగంలో పట్లోళ్ల ఇంద్రారెడ్డి ఛాంపియన్‌గా నిలవగా, ఓపెన్ కేటగిరీలో అన్ని గేమ్స్ విజేతగా నిలిచి భరత్‌కుమార్ రెడ్డి లక్ష రూపాల ప్రైజ్ మనీ గెల్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ, కార్పొరేటర్ దేదీప్య, సంక్షేమ సమితి ప్రతినిధులు

ప్రైవేట్ హాస్టళ్లతో సమస్యలు

● మధురానగర్ కాలనీ అధ్యక్షుడి ఫిర్యాదు

పంజాగుట్ట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో ప్రైవేట్‌హాస్టల్స్ కారణంగా సమస్యలు తలెత్తుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, త్వరలోనే హాస్టల్స్ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని మధురానగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌వర్మ అన్నారు. ఆదివారం రాత్రి మధురానగర్‌లోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీహాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేదీప్యతో కలిసి మధురానగర్ సంక్షేమ సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు మనోహర్‌రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ హాస్టల్స్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రాత్రి సమయంలో యువత రహదారులపై తిష్టవేస్తున్నారన్నారు. పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని కోరారు. స్పందించిన ఇన్‌స్పెక్టర్ త్వరలోనే నిర్వాహకులతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి సుగుణ, సంయుక్త కార్యదర్శి హనుమంతరావు యాదవ్, గంగారెడ్డి, కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్త యాత్ర

పంజాగుట్ట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రజల దృష్టికి తీసుకువెళ్లేందుకు సంఘటి ఫౌండేషన్, ఐడియా బైట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైడ్ బై దివ్యంగ ఫర్ యాక్సిసబుల్ ఇండియా యాత్రను చేపట్టింది. మూడు త్రిచక్ర వాహనాలపై బయలుదేరిన ఈ యాత్ర సోమవారం నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుధీర్, ఐడియా బైట్స్ సంస్థ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి యాత్ర వివరాలను వెల్లడించారు. ఈ నెల 15న ఢిల్లీలో యాత్ర ప్రారంభమైందని, 12 రాష్ట్రాల గుండా ఆరువేల కిలోమీటర్ల మేర యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఢిల్లీ నుంచి కన్యాకుమారి వరకు వెళ్లి.. తిరిగి అక్కడి నుంచి ఢిల్లీకి చేరుకుంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సాధారణ ప్రజలు సైతం దివ్యాంగులకు చేయూతనివ్వాలని కోరారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయండి

బౌద్ధనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధులను విడుదల చేయాలని కార్పొరేటర్ సామల హేమ, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కోరారు. సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌ను కార్పొరేటర్ కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నిధులను వెంటనే విడుదల చేయాలని కోరామని కార్పొరేటర్ తెలిపారు.


జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సామల హేమ


మెట్టుగూడ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మంత్రి పదవికి అమిత్‌షా రాజీనామా చేయాలి

చిలకలగూడ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అమిత్‌షా దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని, మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీపీఎం సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ అజయ్‌బాబు డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కరుపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో మెట్టుగూడ చౌరస్తాలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ అజయ్‌బాబు మాట్లాడారు. రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న బీజేపీ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.మల్లేష్, ఏ.బాలయ్య, మధు. అనిల్, భీమయ్య. స్వామి, రవి పాల్గొన్నారు.

6న ద్విసహస్ర సువాసినీ పూజ

ఎల్‌బీనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశక్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీశక్తిపీఠం ఆధ్వర్యంలో జనవరి 6న 2000 మంది మహిళా ముత్తైదువలతో ద్విసహస్ర సువాసినీ పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు మునిపల్లె సువర్ణలత తెలిపారు. ఈ కరపత్రాలను ఆరెకేపురంలోని కుర్తాళం పీటం ప్రత్యంగిరా దేవాలయంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త అనంతలక్ష్మి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సువర్ణలత మాట్లాడుతూబీనగర్ సమీపంలోని మగ్దూంపల్లి భైరవపురిలో ద్విసహస్ర సువాసినీ పూజల నిర్వహిస్తున్నామన్నారు. పూజ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు సెల్‌నంబర్ 7997990023, 8858853690లో సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అరుణ, హేమ, రాజ్యలక్ష్మి, పద్మ, శ్రీదేవి, సంజన, ప్రశాంతి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకలు

మారేడుపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తమిళ క్యాలెండర్ ప్రకారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ భక్తాంజనేయ స్వామి వారిని వడమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.


వడమాల అలంకరణలో శ్రీభక్తాంజనేయ స్వామి


నల్లపోచమ్మ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్

నల్లపోచమ్మ, కట్టమైసమ్మ ఆలయాలలో అన్నదానాలు

బోయిన్‌పల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమావాస్యను పురస్కరించుకుని న్యూబోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని శ్రీ దేవి నల్లపోచమ్మ ఆలయం, జయనగర్ చౌరస్తాలోని నల్లపోచమ్మ ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆయా ఆలయాలలో నిర్వహించిన అమావాస్య అన్నదాన కార్యక్రమాలను జంపన్న ప్రతాప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో హ్యూమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ భాటియా వివిధ ఆలయ కమిటీల నిర్వాహకులు దుర్గయ్య, పుట్టి నరసింహ, రామారావు, అజిత్, ప్రేమ్‌కుమార్ ముదిరాజ్, నరేందర్, జహంగీర్ గౌడ్, రాము గౌడ్, శశిధర్ గౌడ్, ఇతర కమిటీ సభ్యులు జాజుల క్రాంతి, సాయి, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మహాకాళి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

లాల్‌బజార్ మహాకాళి ఆలయంలో..

తిరుమలగిరి డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్ లోని శ్రీ మహంకాళి దేవాలయంలో అమావాస్య సందర్భంగా అమ్మవారికి శ్రీమహాకాళి అమావాస్య అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా పూజలు జరిగాయి. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్ సహకారంతో దాతల సహాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, బోర్డు మాజీ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ, వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల రుక్మయ్య, పి.రాజు, రాజా రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ బీసీసెల్ అధ్యక్షుడు ఉమేష్, జాన్, సురేష్, సెంట్రల్ బట్టీ సురేష్, అనురాధ రెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

● కట్టమైసమ్మ ఆలయంలో..


బోయిన్‌పల్లిలోని చిన్నతోకట్ట కట్టమైసమ్మ ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి
- బోయిన్‌పల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి)

వాడీవేడిగా కంటోన్మెంట్ పాలకమండలి సమావేశం

● ఎమ్మెల్యే శ్రీగణేష్ - నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ మధ్య మాటల యుద్ధం

సికింద్రాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ చట్టం, పాలకమండలి సమావేశాలపై అవగాహన లేని ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు అసెంబ్లీ స్పీకర్ అనుమతితో తగిన కౌన్సెలింగ్ ఇవ్వవలసిన ఆవశ్యకత ఉందని కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ చురకలు వేశారు. దీనికి ప్రతిగా ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పందిస్తూ నోరుంది కదా అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం, అబద్ధాలు చెప్పడం తనకు చేతకాదని, చేసేది చెప్పడం - చెప్పిందే చేయడం తన స్వభావమని అన్నారు. ఎన్నికలు నిర్వహించకుండా అన్ని వార్డులకు సభ్యులు లేకుండా, పదే పదే నామినేటెడ్ పదవి తెచ్చుకుంటూ తనకు ఇష్టమైన ప్రాంతాల్లో మాత్రమే అభివృద్ధి పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని రామకృష్ణను ఉద్దేశించి శ్రీగణేష్ వ్యాఖ్యానించారు. తనపై వ్యాఖ్యలు చేయడం నైతికం కాదని రామకృష్ణ కౌంటర్ వేయడంతో సోమవారం జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి సమావేశం వాడీవేడిగా సాగింది.

బ్రిగేడియర్ ఎన్.వి.నంజుండేశ్వర అధ్యక్షతన జరిగిన సమావేశంలో కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యునిగా జె.రామకృష్ణ, ఎక్స్‌అఫీషియో సభ్యునిగా శ్రీగణేష్, కంటోన్మెంట్ సభ్య కార్యదర్శిగా సీఈఓ మధుకర్ నాయక్ హాజరయ్యారు. రాజీవ్ రహదారిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, మంచినీటి సరఫరా, రోడ్ల నిర్మాణం, భవన నిర్మాణాల అనుమతి కోసం వచ్చిన దరఖాస్తులు, పికెట్ పార్కులో దివంగత ప్రధాని వాజ్‌పేయి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తదితర అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ఆయా ప్రతిపాదనలను ఆమోదించే విషయమై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రామకృష్ణ, శ్రీగణేష్‌ల మధ్య పలుమార్లు వాదోపవాదాలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు అండగా ఉందని, గతంలో ఎవరూ చేయని విధంగా వాటర్ బోర్డు నుంచి ప్రతి రోజూ ఒక ఎంజీడీ నీటి సప్లయ్‌ని పెంచిందని, కంటోన్మెంట్ బోర్డు వద్ద నీటి నిల్వ సామర్థ్యం ఉంటే ఎన్ని ఎంజీడీలైనా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రీగణేష్ స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రోడ్ల విస్తరణ సవ్యంగా లేదని, సిటీలో ఎక్కడా లేని విధంగా కంటోన్మెంట్ మీదుగా నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల కోసం 200 అడుగుల మేరకు రోడ్లను విస్తరించాలనడం భావ్యం కాదని, రోడ్డు విస్తరణ వలన ఆస్తులు కోల్పోయే వారికి నష్టపరిహారం చెల్లింపు విషయంలో స్పష్టత లేదని రామకృష్ణ విమర్శించగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్ల విస్తరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రజలను ఒప్పించి తాము ముందుకు వెళతామని, నష్టపరిహారం విషయంలో అందరికీ న్యాయం జరుగుతుందని, దీనికి స్థానిక ఎమ్మెల్యేగా తాను పూర్తి బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా అటు ఎమ్మెల్యే శ్రీగణేష్, నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణల మధ్య మాటల యుద్ధం ముదరకుండా శాంతింపజేయడానికి బ్రిగేడియర్ నంజుండేశ్వర, సీఈఓ మధుకర్ నాయక్ చొరవ చూపడం గమనార్హం.


కంటోన్మెంట్ పాలకమండలి సమావేశంలో పాల్గొన్న శ్రీగణేష్, రామకృష్ణ

నీటి బిల్లుల చెల్లింపునకు.. ఓటీఎస్ మరో నెల పొడిగింపు

మంచినీటి బిల్లుల బకాయిలు చెల్లింపు కోసం సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రవేశపెట్టిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను మరో నెల రోజుల పాటు (జనవరి 31వ తేదీ వరకు) పొడిగించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి నిర్ణయించింది. ఓటీఎస్ కింద బిల్లులు చెల్లించే వారికి 10% రాయితీ ఇవ్వనున్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకురా..

● రామకృష్ణకు ఎమ్మెల్యే శ్రీగణేష్ సవాల్

మారేడుపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తాను ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ రావాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు అబద్ధపు మాటలతో ప్రజలను మోసం చేస్తూ పదవులు కాపాడుకుంటూ వ్యాపార లావాదేవీలకే అధిక ప్రాధాన్యమిస్తున్నాడని ఆరోపించారు. సోమవారం పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సామావేశంలో ఆయన మాట్లాడారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యేకు అవగాహన లేదని రామకృష్ణ బోర్డు సమావేశంలో మాట్లాడడంలో అర్థం లేదని శ్రీగణేష్ అన్నారు. ఎన్నికైన ఆరు నెలలలోనే మంచినీటి సమస్యను పరిష్కరించామని, కంటోన్మెంట్‌లో తాము చేసిన అభివృద్ధి పనులను కోర్టుకు వెళ్ళి తామే అనుమతులు తీసుకువచ్చామని రామకృష్ణ చెప్పుకోవడంలో ఎలాంటి అర్థం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రమంతా రిజిస్ట్రేషన్ చార్జీలు 7.5% ఉండగా కంటోన్మెంట్‌లో మాత్రం 10.5% అధికంగా ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి చార్జీలు తగ్గించి కంటోన్మెంట్ ప్రజలకు న్యాయం చేయాలని బోర్డు సభ్యుడు రామకృష్ణకు సూచించారు. రూ. 900కోట్లకు పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్‌కు బకాయిలు రావాలని, వాటిని రాబట్టి చూపించాలని ఆయన సవాల్ విసిరారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి అవరోధంగా శ్రీగణేష్

● కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

సికింద్రాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డిల బాటలో పయనిస్తూ ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ విస్మరిస్తున్నారని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఆరోపించారు. సోమవారం కంటోన్మెంట్ పాలకమండలి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కంటోన్మెంట్‌లోని అన్ని వార్డుల్లో రోడ్ల నిర్మాణం, నిర్వహణ కోసం అంచనాలు, ప్రతిపాదనల గురించి చర్చ జరగగా, వీటిని ఆపివేయాలని శ్రీగణేష్ కోరారని ఆయన చెప్పారు. ప్రజా వ్యతిరేక చర్యలకు ఎమ్మెల్యే పాల్పడినందున ఈ రోజును బ్లాక్ డేగా తాము పరిగణిస్తున్నట్లు రామకృష్ణ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నుంచి కంటోన్మెంట్‌కు ఏమాత్రం సహకారం లభించడం లేదని, తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించడం వల్లనే టీపీటీ బకాయిలు విడుదల చేశారని, కంటోన్మెంట్‌లో ఉచిత మంచినీటి పథకం గురించి మాట్లాడుతున్నారని అన్నారు. ప్రతిపక్ష నాయకులకు కూడా చేతనైతే ఆందోళనలు, న్యాయపోరాటం ద్వారా కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు.

జీఆర్‌పీల పరిధిలో 2,623 కేసులు నమోదు

● రైళ్లలో నేరాలు జరిగితే 139కు డయల్ చేయండి ● రైల్వే ఎస్పీ చందనాదీప్తి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్‌పీ) స్టేషన్ల పరిధిలో మొత్తం 2,623 కేసులు నమోదయ్యాయని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీలు జావెద్, శ్రీనివాస్, కృపాకర్, శ్రీనివాస్, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, కాచిగూడ జీఆర్‌పీ సీఐ ఎల్లప్ప, నాంపల్లి జీఆర్‌పీ సీఐ ప్రవీణ్ కుమార్, సికింద్రాబాద్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రైల్వే క్రైమ్ రికార్డు ఇన్‌స్పెక్టర్ ఖాదర్ హుస్సైన్‌తో కలిసి రైల్వే ఎస్పీ చందనాదీప్తి 2024 ఏడాదిలో రైల్వే స్టేషన్లు, రైళ్లలో జరిగిన వివిధ రకాల నేరాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ ఏడాదిలో రైళ్లలో ప్రయాణికులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ ద్వారా గుర్తించి వందల సెల్‌ఫోన్లను బాధిత ప్రయాణికులకు తిరిగి అందజేశామని తెలిపారు. రైల్వే ట్రాక్ వద్ద జరిగిన ప్రమాదంలో 1,468 గుర్తుతెలియని వ్యక్తులు చనిపోగా వీటిలో 1,223 మంది ఆచూకీని గుర్తించారు. 245 మంది గుర్తుతెలియని వ్యక్తులుగా మిగిలిపోయారని తెలిపారు. నగర శివారులో పారిశ్రామిక కంపెనీలో పనిచేయించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి రైళ్లలో సికింద్రాబాద్‌కు తరలిస్తున్న బాలకార్మికులను 84 మందిని జీఆర్‌పీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఎస్పీ తెలిపారు. రైళ్లలో నేరాలను నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైళ్లలో ఏవైనా నేరాలు జరిగితే వెంటనే 139 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ చందనాదీప్తి

2024లో నమోదైన కొన్ని కేసులు.. పరిష్కారమైనవి

- మర్డర్ ఫర్ గెయిన్ కేసులు మూడు నమోదు కాగా 3 కేసులను ఛేదించి ముగ్గురిని అరెస్టు చేశారు.
- రెండు హత్య కేసులు నమోదు కాగా ఒక హత్య కేసు ఛేదించి ఒకరిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.
- రైళ్లలో రాబరీ కేసులు 16 నమోదు కాగా 14 కేసులను ఛేదించారు. 16 మందిని అరెస్టు చేశారు.
- డ్రగ్స్ కేసు ఒకటి నమెదు కాగా ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు.
- మాదక ద్రవ్యాలకు సంబంధించి 56 కేసులు నమోదు కాగా 38 కేసులు ఛేదించారు. 53 మంది నిందితులను అరెస్టు చేశారు.
- రైళ్లలో మద్యం సరఫరాకు సంబంధించి 26 కేసులు నమోదు కాగా 3 కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.
- హత్యాయత్నం కేసులు మూడు నమోదు కాగా 2 కేసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.
- అత్యాచారం కేసులు రెండు నమోదు కాగా ఒక కేసును ఛేదించారు. ఒకరిని అరెస్టు చేశారు.
- కిడ్నాప్ కేసులు 7 నమోదు కాగా రెండు కేసుల్లో ముగ్గురు కిడ్నాపర్లను అరెస్టు చేశారు.
- రైళ్లలో తోటి ప్రయాణికులను చీటింగ్ చేసిన కేసులు 9 నమోదు కాగా 5 కేసుల్లో ఆరుగురిని అరెస్టు చేశారు.
- రైళ్లలో చిన్న చిన్న దొంగతనాలు పాల్పడిన 903 కేసులు నమోదు కాగా 142 కేసుల్లో 121 మంది నిందితులను అరెస్టు చేశారు.
- రైళ్లలో ప్రయాణ సమయంలో ప్రయాణికులపై దాడి చేసిన 13 మంది వ్యక్తులపై కేసులు నమోదు కాగా ఐదుగురిని అరెస్టు చేశారు.
- రైళ్లలో ప్రయాణం చేస్తున్న మహిళలపై లైంగిక వేధింపుల కేసులు ఆరు నమోదు కాగా ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు.
- తెలంగాణ వ్యాప్తంగా జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో 41 మంది ప్రయాణికులు అదృశ్యం కాగా 30 కేసులను ఛేదించారు.
- రైళ్లలో నేరాలకు పాల్పడుతున్న మైనర్‌ని అరెస్టు చేసి, జువెనైల్ హోంకు తరలించారు.

'చర్చిల వద్ద పోలీసు రక్షణ కల్పించండి'

అడ్డగుట్ట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా నగరంలోని పలు చర్చిల్లో ప్రార్థనలు చేసేవారికి ఇబ్బందులు లేకుండా పోలీసులతో రక్షణ కల్పించాలని గ్లోబల్ అలైన్స్ ఆఫ్ క్రిస్టియన్ లీడర్స్ చైర్మన్ డేవిడ్ శాంతారాజ్ పేర్కొన్నారు. సోమవారం డీజీపీ జితేందర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. చర్చిల్లో అర్ధరాత్రి వరకు క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని, మద్యం మత్తులో హల్‌చల్ చేసే వారి నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ కల్పించాలని డీజీపీని కోరారు. డీజీపీని కలిసిన వారిలో సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డానియల్, ఆధమ్స్, రాజేంద్రబాబు, చిట్టిబాబు, సామ్యూల్ ఉన్నారు.



పూర్వ అధ్యక్షులను సత్కరిస్తున్న బాబురావు, రవిందర్‌రావు తదితరులు

స్వచ్ఛంద సేవ చేయాలనుకునే వారికి వేదిక లయన్స్ క్లబ్

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవ, ప్రజాసేవ చేయాలనుకునే వారికి లయన్స్ క్లబ్ ఓ వేదికని లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ జి.బాబురావు అన్నారు. సోమవారం సికింద్రాబాద్ లయన్స్ భవన్‌లో నిర్వహించిన లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సమారిటన్స్ (డిస్ట్రిక్ 320బీ) రజతోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమనికి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ సికింద్రాబాద్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం లయన్స్ పూర్వ గవర్నర్‌లను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. అంతకుముందు కార్యక్రమంలో లయన్స్ చార్టర్ అధ్యక్షులు ఆకుల రవిందర్‌రావు, కార్యదర్శి మల్లారెడ్డి, సభ్యులు ఎస్.దేవేందర్ రెడ్డి, ధర్మారావు, టి.రాజేందర్ ప్రసాద్, వేణుగోపాల్, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెయిలింగ్ విజేత గోవర్ధన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ సెయిలింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర సెయిలర్, భారత నెంబర్ వన్ ర్యాంకర్ పల్లారా గోవర్ధన్ సబ్ జూనియర్ విభాగంలో విజేతగా నిలిచాడు. హుస్సేన్ సాగర్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు ముగిశాయి. మొత్తం తొమ్మిది రేసుల్లో గోవర్ధన్ 25 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి, ట్రోఫీను సొంతం చేసుకోగా, దీక్షిత్ రన్నరప్‌గా నిలిచాడు.



గోవర్ధన్



ఆర్ఫిన్ అహ్మద్, యువరాజ్ గుప్తాను సత్కరిస్తున్న ప్రధానోపాధ్యాయులు శౌరి

సెయిలింగ్‌లో రజత పతకాలు సాధించిన విద్యార్థులు

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తెలంగాణ సెయిలింగ్ క్లబ్ అధ్వర్యంలో హుస్సేన్ సాగర్‌లో నిర్వహించిన తెలంగాణ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకాలు సాధించిన ఓల్డ్ నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక (డిజిటల్) పాఠశాలకు ఆర్ఫిన్ అహ్మద్(4వ తరగతి), యువరాజ్ గుప్తా (5వ తరగతి)లను ప్రధానోపాధ్యాయులు చిన్నాబత్తిన శౌరీ సోమవారం ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో 15 జిల్లాల నుండి 131మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ చాంపియన్ షిప్‌లో తమ పాఠశాల విద్యార్థులు రజత పతకాలను సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

అడ్డగుట్ట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే బుకింగ్ కౌంటర్ ఎదురుగా గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే బుకింగ్ కౌంటర్ ఎదురుగా గుర్తుతెలియని వృద్ధుడు(70) చనిపోయాడని ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురికి తరలించారు. మతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. కేసు దర్యాప్తులో ఉంది.


వృద్ధుడి మృతదేహం

గంగపుత్రుల సంక్షేమానికి కృషి

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంగపుత్రుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో గంగపుత్ర స్థానిక సంఘం నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు దేశబోయిన రఘు, గౌరవ అధ్యక్షుడు కైరంకొండ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, సంఘ ప్రతినిధులు పూస రాజకుమార్, యాదగిరి, కిరణ్‌కుమార్, శ్యాంప్రసాద్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.


గంగపుత్ర సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సెట్విన్ కార్యకలాపాల విస్తరణకు చర్యలు

సికింద్రాబాద్ సెట్విన్ కేంద్రం కార్యకలాపాలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తెలిపారు. సీతాఫల్‌మండిలో సెట్విన్ భవనంపై జరుగుతున్న అదనపు అంతస్తుల నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త కోర్సులను ప్రారంభించేందుకు వీలుగా అదనపు అంతస్తులను నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సెట్విన్ ఇన్‌చార్జి అనిత తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో జవాబుదారీతనం ఉండాలి

● రాచకొండ సీపీ సుధీర్‌బాబు ● ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు బాడీవోర్న్ కెమెరాలు అందజేత

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధి నిర్వహణలో పారదర్శకంగా, జవాబుదారీతనంగా వ్యవహరించాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు ట్రాఫిక్ సిబ్బందిని ఆదేశించారు. డ్యూటీలో ఉన్నప్పుడు ప్రజలతో వారు ప్రవర్తించే విధానం గౌరవప్రదంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా వారు మాట్లాడే ప్రతి విషయం రికార్డు అయ్యే విధంగా సిబ్బందికి బాడీవోర్న్ కెమెరాలను అందజేశారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో జరిగిన ట్రాఫిక్ మీటింగ్‌లో ట్రాఫిక్ అధికారులకు కెమెరాలు అందజేశారు. ప్రస్తుతం 50 కెమెరాలు అందజేసిన సీపీ.. ట్రాఫిక్ విధులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సిబ్బంది యూనీఫామ్‌కు ధరించే కెమెరాల వల్ల జవాబుదారీతనం, పారదర్శకతతో పాటు.. ప్రజలతో మాట్లాడే ప్రతి విషయం రికార్డు అవుతుందన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినా, పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించినా ఆధారాలతో సహా.. రికార్డు చేస్తుందన్నారు. అంతేకాకుండా ఎవరైనా అధికారులు ప్రజలతో దురుసుగా ప్రవర్తించినా, ఎన్‌ఫోర్స్‌మెంట్ చేస్తున్న క్రమంలో ఏదైనా ఇబ్బందులు పెట్టినా, అధికారులు అక్రమాలకు పాల్పడినా వెంటనే తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, ఎస్‌వోటీ డీసీపీలు మురళీధర్, రమణారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు